


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

## *కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
## *అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"**వాడికి ఒంట్లో** కులాసాగా వుండడంలేదు" అని సుందరమ్మగారు బదులు పలికేసరికి

"ఏం జబ్బా? ఏం కథా కమామిషూ? డాక్టరికి చూపించారా? ఏమన్నాడు? అపాయమేమీ లేదుకదా?" ఇలా ప్రశ్నల పరంపరలు. అవతలకు పోయి గుసగుసలాడుకోవడం.

రంపపు కోతగా వుండేది మధుబాబుకు.

ఇలాంటి మాయదారి రోగాలు దాపరించినప్పుడు దాని బాధకన్నా ఈ ప్రజల బాధ ఎక్కువ.

ప్రపంచమంటే అసహ్యం కలుగుతోంది అతనికి

అతని కథలు అచ్చేసిన పబ్లిషర్ ఓ రోజు వచ్చి నవలకూడా వేసుకుంటానని అడిగాడు. ఈసారి డబ్బు అడగాలనిపించింది మధుబాబుకు. ముఖం ఎదుట అడగలేక అప్పటికి సరే అని తర్వాత పనివాడి చేతికి ఉత్తరం ఇచ్చి పంపించాడు.

ఆ పబ్లిషర్ రెండొందలు ఇస్తానని కబురు చేశాడు. ఇది అన్యాయం ఆ పుస్తకం ధర ప్రకారం కనీసం అయిదారు వందలు రావాలి. మధుబాబు ఆ సాయంత్రం ఉపాపతి వచ్చినప్పుడు సలహా అడిగాడు.

"అయిదువందలకు దమ్మిడీ తక్కువైనా ఒప్పుకోబోకండి" అన్నాడు ఉమాపతి. మొహం ఎదుట అయితే నోరు విప్పడుగాని ఉత్తరాల్లో తన ప్రతాపం ప్రదర్శిస్తాడు మధుబాబు. అలాగే రాసి పంపించాడు. పబ్లిషర్ మరో యాభయిదాకా చేసి బేరం పెట్టాడు. మధుబాబు అంగీకరించలేదు. చివరకు వ్యవహారం విఫలమైపోయింది.

డబ్బుకోసం ఆశపడి అవకాశం పాడుచేసుకున్నానేమో అనుకున్నాడు మధుబాబు. కాని అతను భయపడనక్కరలేకపోయింది. మరునాటి సాయంత్రానికల్లా మరో పబ్లిషర్ తయారయినాడు. మొదట అతనికి వ్యాపారంలో ప్రతిద్వంది. మవిక్షి డాంబికంగా, సభ్యతగలవాడుగా కనిపిస్తాడు. మాట మృదువుగా వుంటుంది. పాతికల దగ్గరా, యాభయిల దగ్గరా పెంకెతనం చెయ్యడు. "అంత ఇస్తాను. ఇంత ఇస్తాను" అని ముందుగానే చవులూరిస్తాడు. మధుబాబు ఉబ్బితబ్బిబ్బయిపోయి నవల కటింగ్స్ తెచ్చి ఆయన చేతిలో పెట్టాడు.

"ఎగ్రిమెంటు రాసుకోక పోయినారా?" అని అడిగాడు ఉమాపతి.

"అబ్బే! ఆయన చాలా పెద్దమనిషి. అంత నిక్కచ్చిగా వుండటం బాగుండదు. రేపు ఫస్టకల్లా యడ్వాన్స్‌గా సగం ఇస్తానన్నాడు" అన్నాడు మధుబాబు.

ఉపాపతి మౌనంగా ఊరుకున్నాడు.

మెల్లిగా రోజులు గడుస్తున్నాయి. మధుబాబు ఆరోగ్యం కుదుటబడుతోంది. మనిషి కొంచెం వళ్ళు చేస్తున్నాడు. బయటకు పోకుండా నీడ పట్టున వుడటంవల్ల శరీరానికి వింతకాంతి రాసాగింది. ముఖం గుండ్రంగా పొంకంగా తయారవుతోంది. అద్దంలో చూసుకుంటూంటే, అతనికి విచిత్రంగా ఉత్సాహంగా వుండేది.

హైదరాబాద్ వీక్లీ వాళ్ళు మరో నవలేమైనా వుంటే పంపమని కోరుతూ రాశారు కొన్నాళ్ళకు.

అతనికి మహా ఉద్రేకం. తను రాయాలి... రాయాలి. ఎందుకిలా వృథా చేస్తున్నాడు? ఆ రాత్రి చాలా సేపటివరకూ దాన్ని గురించే ఆలోచిస్తూ పడుకున్నాడు. అయితే మునుపటికీ ఇప్పటికీ ఓ తేడా తెలిసి వచ్చింది. ఇంతవరకూ తనకు తెలియని ఏ సంగతి గురించయినా తడబాటు లేకుండా స్పష్టంగా యోచించి ఓ రూపకల్పన చేస్తూండేవాడు. ఇప్పుడెంత బుర్ర బద్దలుకొట్టుకున్నా తన పరిసరాలూ, తనూ, తన మనస్తత్వం ఇవ్వే మనోపథంలో మెదుల్తున్నాయిగాని కొత్త ఇతివృత్తం గిరగిర స్ఫురించటంలేదు, తను కొత్తబాట తొక్కనున్నాడా? కొత్త అధ్యాయంలో ప్రవేశిస్తున్నాడా?

మొత్తం మీద స్థూలంగా ఓ ప్లాట్ తయారుచేసుకున్నాడు. రెండు మూడు పాత్రల్ని వాటి విచిత్ర మనస్తత్వాలనీ మనసులో సృష్టించుకున్నాడు. ఇప్పుడు మనసు కొత్తరకంగా భావనచేస్తోంది. అడుగడుక్కి ఏమిటో సంఘర్షణ. మనిషిమీద మనిషి ప్రభావం స్వార్ధం త్యాగం పుణ్యం పాపం వీటి తేడాల విలువలు, పాపానికి పరిధి ఎంత? సత్యానికి సరిహద్దులేమిటి అదృష్టానికి ఆనకట్ట ఎక్కడ ఓ మహా సంకుల సమరం చెలరేగుతుంది అతని మస్తిష్కంలో. ఇహ ఆ పాత్రల్ని తలచుకుంటూ, ఈ సంఘర్షణను పరచుకుంటూ పోవాలి. జీవితంలో పిరికివాళ్ళన్నా, అసమర్ధులన్నా ఓ ఆసక్తి సానుభూతి పెరిగింది. విభిన్న దృక్పధాలుగల వేరు వేరు వ్యక్తుల్ని తీసుకుని వారిచుట్టూ పరిస్థితులూ, వాతావరణం కల్పిస్తూ ముందుకు పోసాగాడు.

## 17

అతని నవల అచ్చువేస్తానని తీసుకువెళ్ళాడేగాని ఎన్నిసార్లు కబురుచేసినా ఆ పబ్లిషర్ ఉలకడు పలకడు. గట్టిగా ఉత్తరం రాసి పంపించేసరికి "ఇదిగో ఈ నెలలో ప్రారంభిస్తున్నా" అంటాడు. ఎందుకని త్వరగా మొదలుపెట్టడో అర్ధంకాదు మధుబాబుకు. అతన్లో అసహనం యెక్కువ కాసాగింది. ఇంతలో సాహితీ సమితి పదేళ్ళుగా వచ్చిన నవలలన్నిట్లోనూ ఉత్తమ నవలను బహూకరించటానికి నిర్ణయంచేసి ప్రకటించింది. దానికి పుస్తకరూపంలో వున్న నవలలే పరిశీలించబడుతాయి. మధుబాబుకి మరీ ఆతృత హెచ్చింది. తను బయటకు పోవటానికి వీల్లేదు. పబ్లిషర్ రావటం మానేశాడు. గట్టిగా ఓ జాబురాసి పంపించాడు. "ఈ నెలాఖరులోగా తప్పకుండా పుస్తకం పూర్తిచేస్తున్నాం" అని హామీ యిస్తూ జవాబు పంపించాడు.

హైదరాబాద్ వీక్లీలో అతని రెండో నవల ప్రచురణ ప్రారంభమయింది. అయితే మొదటిదాని శైలికీ, దీని శైలికీ బొత్తిగా సంబంధంలేదు. ఇది చదివి ఎవరూ పోల్చక పోవచ్చు. "అయ్యో పాపం" అని నిట్టూర్పులు విడవకపోవచ్చు. కాని అడుగడుక్కీ రచయితపడే ఆవేదన, అతనిలోని సంఘర్షణ, మానసిక పరిణామం, అతడ్ని గందరగోళ పరుస్తున్న సమస్యలు కనిపించి తీరుతాయి. మొదటి నవల స్కూలు విద్యార్థుల దగ్గరనుంచీకూడా ఆకర్షించి తేలిగ్గా హృదయంలో నాటుకుంది. అది ప్రతివాడికీ సన్నిహితంగావున్న సమస్య. నిత్యజీవిత సంఘటనలకు స్పష్టమైన చిత్రణ. అది మాములు పాఠకుడి గుండెల్లో సూటిగా గ్రుచ్చుకోకపోవచ్చు. అతీతమైన మనస్తత్వాలకు సంబంధించినది. గండిపడ్డ జీవితాల విషాద చరిత్ర, కదిలినవారు విపరీతంగా కదిలిపోయారు. అట్లా మధుబాబు అజ్ఞాతంగా వున్న కొందరి వ్యక్తులకు మరీ సన్నిహితుడైపోయాడు.

అతనికి చిత్రవిచిత్రమైన ఉత్తరాలు రాసాగినై. వాటిలో కొన్ని తల్లి చూసింది. ఇలా ఆడపిల్లల దగ్గరనుంచి కొడుక్కి ఉత్తరాలు రావటం ఆవిడను కంగారు పెట్టింది. కానీ మధుబాబు శీలాన్ని గురించి, నడవడికను గురించి ఆవిడకు దృఢమైన నమ్మకం, గురీ వున్నాయి. అందుకని బయటకు ఈ సంగతి ఏమీ ప్రస్తావించలేదు.

ఈ మధ్య మధుబాబు స్త్రీని గురించి యెక్కువగా ఆలోచించటం మొదలుపెట్టాడు. అతనికి వచ్చే ఉత్తరాలు కొన్ని అందుకు ముఖ్య కారణాలైనాయి. కొందరు తమ విషాదగాధల్ని, విచిత్ర చరిత్రల్నీ అతనికి వాటిల్లో విపులంగా చెప్పుకున్నారు. తర్వాత తమ బంధువుల్లోని కొందరు ఆడవాళ్ళ దారుణ స్థితుగతులు అతనికి తెలుసు. రచనా వ్యాసంగం ఆరంభమైనప్పట్నుంచీ అతను ప్రతిమనిషి స్వభావాన్ని పరిశీలనాదృష్టితో చూడటం ప్రారంభించాడు. స్త్రీలకు జరిగే అన్యాయాలని గురించీ, పురుషుల వికృత చర్యలగురించీ అతను ఇదివరకే రాశాడు. కాని ఇప్పుడు ప్రత్యేకం ఆ పరిశీలనలోనే తృష్ణ ఎక్కువయింది. దాంతో సాంఘిక ధర్మాలని గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు. వివాహబంధం, స్త్రీమీద పురుషుడి అధికారం, ప్రేమ, కూతురిగా, తల్లిగా, భార్యగా, స్త్రీ బాధ్యత, కుటుంబాల్లో అరాజకం, అశాంతి, భార్యాభర్తల మధ్య విముఖత్వం, హింసాకాండ, లేచిపోవటం, వెళ్ళగొట్టటం ఆత్మహత్యలు అతడ్ని కలవరపరిచినై. ప్రపంచం ఇంత అస్తవ్యస్తంగా, అపశృతులతో, ఆర్భాటాలతో ఎట్లా ఇంతవరకూ నడిచిందో అతనికి అర్ధకాలేదు. చేయని తప్పుకు భార్యని చావగొట్టినవాడిని చూశాడు.

లేని నిజాన్ని సృష్టించటం కోసం కూతుర్ని చిత్రహింస చేసినవాడ్ని చూశాడు. భర్త తనని చావగొట్టి చెవులు మూసినా అతన్ని మనస్ఫూర్తిగా ఆరాధించటం చూసి విస్తుపోయాడు. రోజూ చిత్రహింస పెడుతున్నా పెనిమిటికి ప్రాణం మీదకు వస్తే "నా మంగళసూత్రం కాపాడమని" భగవంతుడ్ని ప్రార్ధించే అతివని చూసి కలవరపడ్డాడు. ఎట్లా యీ వ్యవస్థ

చక్కబడటం? ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ ఈ భేదాలు కలకాల నశించవా? సమానత్వంవల్ల నష్టముందా? సంభవమా అది?

ఈ మానసిక గందరగోళంలో అతను మళ్ళీ శరత్, చలం చదివాడు. ఒకే విషయాన్ని గురించి వివిధ కోణాలలో ఎందుకు చెప్పారు? శరత్ పాత్రలను కరుణామయంగా చిత్రించాడు. చలం సంఘం పట్ల తనకున్న కసిని కూడా జోడించి విడిచిపెట్టాడు. శరత్ తన హృదయాంతర్గత వేదనని పాత్రల అసమర్ధత ద్వారా వెలిబుచ్చాడు. చలం పాత్రలను తనే డామినేట్ చేసి విశ్వవిహారం చేశాడు. జరిగేది రాశాడు శరత్. ఇలా జరిగితే బాగుంటుందనుకున్నది రాశాడు చలం. శరత్ తాను తీసుకున్న సమస్యకు అనుగుణ్యంగా సరిపోయే వాతావరణం, బలమైన ఇతివృత్తం తీసుకున్నాడు. చలం ఇతివృత్తంకోసం, వాతావరణం కోసం పేచీపడక సూటిగా చెప్పటమే పనిగా పెట్టుకోవటంవల్ల అవి వ్యాసాలుగా, విమర్శలుగా కనిపించాయి. శరత్ తానేగాకుండా అతని పాత్రలు కూడా నిలిచేటట్లుగా చేశాడు, చలం తాను మాత్రమే నిలిచే రచనలు చేశాడు. శరత్ సాహిత్యం పాఠకుల్ని కన్విన్స్ చేసి తనవైపు లాక్కుంటుంది. చలం సాహిత్యం పాఠకుల్ని భయపెడుతుంది, గందరగోళ పరుస్తుంది. ఆ గందరగోళం ఎటువైపు యీడ్చుకుపోతోందో ఏమీ తేల్చి చెప్పలేం.

ఎంత ఉత్తమ ప్రయోజనాన్ని ఆశించి రచన చేసినా ప్రజల్ని భయపెట్టే సాహిత్యం సృష్టించటం మంచిదికాదనే నిర్ణయానికి వచ్చాడు మధుబాబు. కాగా పోగా ఇన్ని అరుపులు అరిచి, అతివాదాలు రేపి, యీ మొగాళ్ళందర్నీ కత్తితో పొడిచి పారేయాలన్న ఉద్రేకం ప్రదర్శించి వీళ్ళంతా శరత్ శేష ప్రశ్న, చరిత్ర హీనులకు తూగే నవల రాశారా అని ప్రశ్న వేసుకునేసరికి "లేదు" అని జవాబు చెప్పుకోవాల్సి వచ్చింది మధుబాబుకు. అక్షయబాబువంటి పరమ ఛాందసుడ్ని కూడా తన వాదన ప్రభావంతో జయించి సానుభూతి సంపాదిస్తుంది కమల. అలాంటి పాత్రలు ఏవి ఇతరుల సాహిత్య సృష్టిలో? అదీగాక సెక్స్ వాదం అసలు విషయాన్ని మరుగుపరిచి అనుకోని పరిణామాలకు దారితీసిందని విశ్వసించాడు మధుబాబు. జీవితంలో సెక్సుకు ప్రముఖస్థానం వుంటే వుండవచ్చుగాని సెక్సునే జీవితంగా చిత్రించటం అది యితర సమస్యలను మింగివేసినట్టు చిత్రించటం అతనికి నచ్చలేదు. వాస్తవికతకు అపార్థాలేమో యివన్నీ. అదీగాక యీ కొత్త సాహిత్యంలోని మనుషులు తాము ఏది అసహ్యించుకుని కొత్త జీవితాన్ని వెదుక్కుంటూ పోతున్నారో, తిరిగి అక్కడ అలాంటి అసహ్యాన్నే ఆదరించటం చికాకనిపించింది. భర్త నశ్యం పీలిస్తే భరించలేని వ్యక్తి, అందుకుగాను అతడ్ని చీదరించుకున్న వ్యక్తి, ప్రియుడు తాగి వచ్చినా, తనకు సమ్మతం కాని మాంసం భుజించినా, బండబూతులు తిట్టినా, తన్నినా అదో ప్రేమ క్రింద అభిమానిస్తోంది. ఏమిటి ఈ నిజాయితీ? ప్రేమించినవాడికోసం భర్తనూ, సంసారాన్నీ, సమస్తాన్ని త్యజించి వెళ్ళటం త్యాగమే అయితే ఈ భూమ్మీద త్యాగం అని మనం దేనిని సమర్ధించలేం? నిజమైన త్యాగానికి నిర్వచనం ఏమిటి?

అతనికి అంతుపట్టటంలేదు.

ఈ హఠాత్తు పరిణామాలవల్ల, నిర్ణయాలవల్ల సుఖభ్రాంతేగాని సుఖం లేదన్న నమ్మకం అతనికి కలగసాగింది. టాల్‌స్టాయ్ అనాకెరినినాలో ఆమె భర్తని విడిచిపెట్టి వెళ్ళాక ఎదుర్కొన్న ఒడుదుడుకుల్ని, దారుణ మానసిక నరకాన్ని చిత్రించటానికి వందలు కొద్దీ పేజీలు రాయాల్సి వచ్చింది. ఇట్లా కొత్త బాటలు వెదుక్కుంటూన్న కొద్దీ అడుగడుక్కీ అశాంతీ, భీభత్సమేకాని నిజమైన మనుగడ ఎక్కడ? ఇంకో విషయం జీవితాదర్శం సుఖాన్వేషనే అయితే అది అంతూ, ఫలితంలేని అనుభవాల సంపుటేగాని, చివరి దశలో విరాగిని చేసే ఓ సాధనమేగాని "యిదే సుఖం" అని స్థిరంగా జీవించే మహత్తర సత్యం మాత్రం కాదు.

Post your comments

*(కొనసాగింపు వచ్చే నెలలో)*